క్లుప్తంగా

నందీశ్వరునికి త్రయోదశి అభిషేకాలు



రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామంలో వేంచేసి ఉన్న గంగాపార్వతీ సమేత వల్లభేశ్వరీ స్వామి ఆలయంలో ఆదివారం త్రయోదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తిక త్రయోదశిని పురస్కరించుకొని నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అభిషేకాలను ఆలయ ప్రధాన అర్చకులు పరమేశ్వరశర్మ నిర్వహించగా పలువురు భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

మృతురాలి కుటుంబానికి మట్టి ఖర్చులు



నాదెండ్ల: తల్లి మందలించటంతో మనస్తాపానికి గురై యువతి బలవన్మరణానికి పాల్పడిన సంఘటనలో మృతురాలి కుటుంబానికి గణపవరం హెల్పింగ్ హ్యాండ్స్ గ్రూపు చేయూతనిచ్చింది. మృతురాలి తండ్రి శివ కారు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఆదివారం బాధిత కుటుంబానికి గ్రూపు సభ్యులు రూ.9 వేలు నగదును మట్టి ఖర్చుల నిమిత్తం అందించారు. పేదరికం కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు తమ గ్రూపు ద్వారా చేయూతనిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తులం సుధాకర్, గ్రూపు సభ్యులు సూరా శంకరరెడ్డి, కొండెపాటి నాగయ్య, పి.ప్రభుదాసు, దారా కొండయ్య, ఆలోకం మారుతి మాస్టారు, హుస్సేన్‌దాదా, అవ్వారు సుబ్రహ్మణ్యం, వెంకటేష్ పాల్గొన్నారు.

సాతులూరులో కారు ఢీకొని తండ్రీకొడుకులకు గాయాలు



నాదెండ్ల: గుంటూరు–కర్నూలు రాష్ట్రీయ రహదారి సాతులూరు వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులకు తీవ్ర గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు, వినుకొండ సమీపంలోని నూజెండ్లపల్లి మండలానికి చెందిన ఎన్ శ్రీనివాసరావు, కుమారుడు మోహన్ అభిమన్యు, తల్లితో కలిసి బైక్‌పై గుంటూరు వెళ్ళారు. షాపింగ్ అనంతరం సాయంత్రం 4 గంటల సమయంలో సాతులూరు రెడ్డిపేరంటాలమ్మ ఆలయం వద్దకు వచ్చేసరికి నరసరావుపేట నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు మరో కారును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రీ కొడుకులకు కాళ్లు దెబ్బతినగా, తల్లికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను నరసరావుపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం

డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి స్పందన

వినుకొండ(నూజెండ్ల): స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ఐదు ఫిర్యాదులు అందినట్లు డీఎం కోటేశ్వరరావు నాయక్ తెలిపారు. ప్రకాశం జిల్లా ఈదర, దాట్లవారిపాలెం మీదుగా వినుకొండకు ప్రకాశం జిల్లా బస్సులు తిరుగుతున్నాయని, వినుకొండ నుంచి కూడా అదే రూట్‌లో బస్సు సర్వీసులు వేయాలని తలార్లపల్లి గ్రామానికి చెందిన గురవయ్య కోరాడు. అలాగే శావల్యాపురం, సంతమాగులూరు అడ్డరోడ్డు, పిడుగురాళ్ల మీదుగా హైదరాబాద్ బస్సు నడపాలని కోరగా ఉన్నతాధికారుల సూచనల మేరకు సర్వీసు నడుపుతామన్నారు. తదితర సమస్యలపై ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. ప్రయాణీకులకు మెరుగైన సేవల కోసం వారు సూచించిన విధంగా సర్వీసులు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

విద్యుత్ శాఖకు రూ.2 లక్షల నష్టం

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామం జాతీయ రహదారి మర్గంలో శనివారం రాత్రి 33/11 కె.వి.సామర్థ్యం కల్గిన హైటెన్షన్ విద్యుత్ వైర్లు రోడ్డు క్రాసింగ్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు అధిక లోడు సుబాబుల్ లోడుతో వెళుతున్న లారీ వలన తెగిపోవటంతో రూ. 2 లక్షల నష్టం వాటిల్లినట్లు మండల ఏఈ సంపెంగుల గాంధీ ఆదివారం తెలిపారు. ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ ప్రమాదంలో పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం వాటిల్లిందన్నారు. సీసీ కెమెరాలు ఆధారంగా లారీను గుర్తిస్తామని ఎస్సై టి. తిరుపతిరావు తెలిపారు.

ఘనంగా బంధుమిత్రుల తోటసమారాధనలు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో గల శ్రీ సంతాన వేణుగోపాలస్వామి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో కార్తిక మాస వనభోజనాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వ్యాపారవేత్త పిట్టముడుసుల లింగరాజు, కనపర్తి వెంకట్రావు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్యఅతిథిగా తాళ్ల వెంకటేష్‌యాదవ్, యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుర్రా శ్రీనివాసరావులు పాల్గొని కార్తిక మాస వనసమారాధన గురించి వివరించారు. ఆధ్యాత్మిక చింతనతో పాటు ఆనందం, ఆరోగ్య సందేశాన్ని కార్తీక వనభోజనాలు మనకు చాటిచెబుతాయన్నారు. అనంతరం ప్రముఖవ్యాపారవేత్త లింగరాజును కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, ప్రజలు వేలాదిగా పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో....

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం, మ్యూజికల్ చైర్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ప్రముఖ మ్యూజిషన్ విరాట్ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో చేసిన మ్యాజిక్ షో పలువురిని ఆకట్టుకుంది. అనంతరం వివిధ రంగాల్లో సేవలు అందించిన వారిని ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..

కార్తిక మాసం సందర్భంగా వినుకొండ నియోజకవర్గ బ్రాహ్మణుల కార్తిక వన సమారాధన స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లోని సాయిబాబా దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెండి శివలింగానికి పట్టణ పురోహితులు డాక్టర్ యడవల్లి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో వేదమాత బ్రాహ్మణ సేవా సంఘం బ్రాహ్మణ సభ్యులచే వేద మంత్రాలతో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. గాలి రేవతి శిష్య బృందం వారు చేసిన భక్తి పూర్వక నృత్య ప్రదర్శనలు అలరించాయి. వెల్లటూరు రోడ్డులో నిర్మాణం అవుతున్న బ్రాహ్మణ భవన్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వినుకొండ కార్తిక వనసమారాధనలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిన్నారులు

సొలసలో...

యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీభూసమేత రంగనాయకస్వామి దేవస్థానంలో దీపాలు దేదీప్య వెలుగులు విరజిమ్మాయి. కార్తిక మాసం ప్రారంభం నుంచి నిత్యం కాంతులతో ఆలయం ధగధగ మెరుస్తుంది. ఆలయ ప్రధాన అర్చకులు పర్చూరి రామకృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్న పూజల్లో భక్తులు విశేషంగా పాల్గొంటున్నారు. ఆదివారం సాయంత్రం ఆలయం ప్రాంగణంలో మహిళలు అధికంగా పాల్గొని వెంకటేశ్వరుడు, శంఖు, నామం, చక్రాలను, మహాశివుడు, అమ్మవారి రూపాలను రంగవల్లులతో అలంకరించి ప్రమిదలను ఏర్పాటు చేసి దీపాలను వెలిగించారు. గోవింద, శివ నామస్మరణతో దేవాలయం మారుమ్రోగింది.

ఆర్యవైశ్యులు అన్నీ రంగాల్లో రాణించాలి



మహిళలకు బహుమతులు అందజేస్తున్న సంఘం నేతలు

శావల్యాపురం: ఆర్యవైశ్యులు అన్నీ రంగాల్లో రాణించాలని జిల్లా ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యులు రెడ్డి కృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని శానంపూడి శివారు గ్రామమైన బొందిలిపాలెంలో వేంచేసియున్న శ్రీఅడవి పేరంటాళ్ళమ్మ అమ్మవారి సన్నిధిలో మండల ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో 13వ కార్తికమాస వనసమారాధన ఘనంగా నిర్వహించారు. తొలుత వాసవి అమ్మవారు, పొట్టి శ్రీరాములు, గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈసందర్భంగా శ్రీ అడవి పేరంటాళ్ళమ్మ దేవాలయం నిర్మాణంలో పాటు ఆర్యవైశ్యుల అభ్యున్నతిలో తనవంతు కీలకపాత్ర పోషించిన కీ.శే గట్టుపల్లి శ్రీనివాసరావు రెండు నిముషాలు మౌనం పాటించారు. ఈసందర్భంగా రెడ్డి కృష్ణ మాట్లాడుతూ కార్తిక మాసంలో ఇలాంటి కార్యక్రమాలు జరుపుకోవటం వలన సంస్కృతులు సంప్రదాయాలకు మంచి శుభాపరిణామమన్నారు. అనంతరం వనసమారాధన వేడుకల్లో పాల్గొన్న మహిళలకు వివిధ రకాల పోటీల్లో విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమ నిర్వాహణలో కీలకపాత్ర పోషించిన రెడ్డి కృష్ణ, గట్టుపల్లి సత్యనారాయణ జిల్లా నేతలను ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొల్లిపోర శ్రీనివాసరావు, కేతేపల్లి వెంకటేశ్వర్లు, రెడ్డి జ్వాలా నరసింహా రావు, పద్మనాభుని హనుమంతరావు, గట్టుపల్లి వీరాంజినేయులు, జవ్వాది అంజయ్య, సనిశెట్టి లక్ష్మీనారాయణ, మోటుమర్రి నరసింహారావు, జక్కా నాగ శ్రీనివాసరావు, దేసు నాగశ్రీను, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కోటప్పకొండలో...



కృష్ణబలిజ అన్నదాన సత్రానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: కార్తికమాసం చివరి ఆదివారం కావడంతో కోటప్పకొండలోని పలు సత్రాల్లో వనసమారాధనలు ఘనంగా నిర్వహించారు. దీంతో కోటప్పకొండలో ఆదివారం కోలాహలం నెలకొంది. రెడ్లసత్రం, యాదవ సత్రం, శ్రీకృష్ణదేవరాయ సత్రం, రజకుల సత్రం, వడియరాజుల సత్రం, ఏకలవ్య అన్నదాన సత్రం, పద్మశాలీ సత్రం, ముదిరాజుల సత్రం, కృష్ణబలిజ సత్రాలలో కార్తీక వన సమారాధనలు నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆయా సత్రాలలో వనసమారాధనలో పాల్గొన్నారు. వన సమారాధనలో పాల్గొనేందుకు వచ్చిన సంఘీయులు కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు తరలిరావడంతో ఆలయంలో సందడి నెలకుంది.



వినుకొండలో ప్రముఖ వ్యాపారవేత్త లింగరాజుకు సన్మానం చేస్తున్న వేణుగోపాల స్వామి దేవస్థానం కమిటీ సభ్యులు



సొలసలో అమ్మవారి రూపంలో దీపార్చన చేస్తున్న భక్తులు



కోటప్పకొండలో పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమారాధన

గణపవరంలో ఘనంగా సత్యవ్రతాలు



నాదెండ్ల: గణపవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని కార్తిక మాస పూజలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటూ జరిగే పూజల్లో భాగంగా తొలి రోజు బహుళ త్రయోదశి సందర్భంగా గోపూజ నిర్వహించారు. శ్రీరమాసహిత వీరవెంకట సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజార్లు డి.ఉమామహేశ్వర శర్మ, అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో స్వామివార్లను అలంకరించారు. 11 మంది దంపతులు పీటలపై కూర్చుని సామూహిక వ్రతాలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సోమవారం ఆలయంలో ఉదయం 9 గంటలకు భవానీ శంకరస్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించనున్నారు.

రేపు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

చిలకలూరిపేటటౌన్: ఆర్టీసీ ప్రయాణికుల సౌలభ్యం కోసం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎస్ రాంబాబు చెప్పారు. ఈ నెల 12వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలను సెల్ నంబర్ 9959225427కు సంబంధిత వేళల్లో ఫోన్ ద్వారా తెలియజేయాలన్నారు.

ముత్తనపల్లి కవికి కళా ఉత్సవాలకు ఆహ్వానం

రొంపిచర్ల: మండలంలో ముత్తనపల్లి గ్రామానికి చెందిన కవి, రచయిత గార్లపాటి పాపారావుకు ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలకు ఆహ్వానం వచ్చింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో కవి, రచయిత పాపారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన, ఐయస్ఓ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 16,17తేదీలలో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలో జరిగే ప్రపంచ స్థాయి కవితా గానం కార్యక్రమానికి ఆహ్వానం అందిందన్నారు.

నేటి నుంచి పంట నష్టం అంచనా


- వ్యవసాయ క్షేత్రాలకు రానున్న బృందాలు
- వారం రోజుల పాటు ప్రక్రియ: ఏడీఏ



పిచికలపాలెంలో దెబ్బతిన్న మొక్కజొన్న కండెను పరిశీలిస్తున్న ఏవో ప్రవీణ్

శావల్యాపురం: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో పంట నష్ట అంచనాను వ్యవసాయ అధికారులు ప్రారంభించారు. నియోజకవర్గంలో 74 రైతుభరోసా కేంద్రాల పరిధిలో వ్యవసాయ సహాయకులు పంట నష్టం అంచనా ప్రక్రియను రంగం సిద్ధం చేశారు. పంట దెబ్బతిన్న పొలాలను క్షేత్రస్థాయిలో రైతు భరోసా సహాయకులు సందర్శించి రైతుల వివరాలు సేకరిస్తున్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా మిరప, వరి, మొక్కజొన్న, శనగ తదితర పంటలు తుఫాన్ దాటికి దెబ్బతిన్నాయి. గ్రామ స్థాయిలో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, రైతుభరోసా సహాయకులు ముగ్గురు టీంగా ఏర్పడి పంట నష్టం అంచనా వేయనున్నట్లు ఏడీఏ బోయపాటి రవిబాబు తెలిపారు. వారం రోజుల పాటు పంట నష్టం అంచనాలు జరుగుతాయన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో పంట నష్టం వాటిల్లిన రైతుల వివరాలు ప్రచురణ చేస్తామన్నారు. శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామంలో అత్యధికంగా శనగ పంట నష్టం వాట్లినట్లు చెప్పారు. నియోజకవర్గంలో శనగ 2111 హెక్టార్లు, వరి–760 హెక్టార్లు, కంది–06 హెక్టార్లు, జొన్న–164 హెక్టార్లు, పొగాకు–161 హెకార్టు, మొక్కజొన్న–394 హెక్టార్లు పంట దెబ్బతిన్నట్లు వెల్లడించారు. పంట నష్టం వాటిల్లిన రైతులు ఆందోళన పడాల్సిన పనిలేదని, ప్రభుత్వపరంగా నష్ట పరిహారం అందేలా చర్యలు చేపట్టామన్నారు.

మానవ హక్కులపై అవగాహన



చిన్నారులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న శిఖా శ్యాంసన్

క్రోసూరు: మానవ హక్కులు రెండు రకాలని ఒకటి జన్మతః లభించేవి కాగా, రెండవది రాజ్యాంగపరంగా లభించేవని, జీవించే హక్కు జన్మతః లభించేది అని మిగతావన్నీ రాజ్యాంగపరంగా లభించేవని శ్యాం మిత్ర మండలి గౌరవ అధ్యక్షుడు శిఖా శ్యాంసన్ ఆదివారం అన్నారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకొని క్రోసూరు ఎస్టీ కాలనీలోని విద్యార్థులకు, ప్రజలకు మానవ హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిఖా శాంసన్ మాట్లాడుతూ మానవ హక్కులను ఎవరైనా ఉల్లంఘించి ఇబ్బందులు గురిచేసినప్పుడు బాధితులు ప్రత్యేక కోర్టులు, మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించవచ్చని పేర్కొన్నారు. అనంతరం పిల్లలకు పెద్దలకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. శ్యామ్ మిత్ర మండలి కార్యదర్శి జానీబాషా, మిత్ర మండలి ఉపాధ్యక్షుడు ఊటుకూరి సలోమాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాకు నిధులు పెంచాలి

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిచే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం చాలా మంచి కార్యక్రమమని, అయితే కేటాయించిన నిధులు మరింత పెంచాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు అన్నారు. పట్టణంలోని పుతుంబాక వెంకటపతి భవన్‌లో ఆదివారం నిర్వహించిన భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. సమావేశానికి డీవైఎఫ్ఐ నాయకురాలు తులసి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో శాశ్వత ప్రాతిపాదికన క్రీడా ప్రాంగణాలు నిర్మించాలన్నారు. గత కార్య క్రమాల సమీక్షతో పాటు భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చించారు. జిల్లా అధ్యక్షుడు వంగర తులసి, సహాయ కార్యదర్శి రాజ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

13 నుంచి సామూహిక శ్రీమద్భగవద్గీత ఆరాధనలు

అమరావతి: మండల పరిధిలోని వైకుంఠపురం భగవాన్ శ్రీ వేదవ్యాస సనాతన ధర్మక్షేత్రంలో ఈనెల 13వతేదీ నుంచి నెల రోజుల పాటు సామూహికంగా శ్రీమత్ భగవద్గీత ఆరాధనలు నిర్వహిసున్నట్లు వేదవ్యాసాలయం ప్రతినిధులు సుభాషిణి, సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పుణ్య మార్గశిర మాసాన్ని పురస్కరించుకుని సామూహికంగా శ్రీమద్భగవద్గీత ఆరాధనలు ప్రతిరోజూ రెండు బ్యాచ్‌లుగా ఉదయం 9 గంటలకు ఒకసారి, మళ్లీ మధ్యాహ్నం 2.30 గంటలకి రెండవసారి నిర్వహిస్తామమన్నారు. ప్రపంచంలోనే అతి పెద్దదైన భగవాన్ శ్రీ వేదవ్యాస సనాతన ధర్మక్షేత్రంలో పరమ పవిత్రమైన మార్గశిర మాసంలో అష్టోత్తర శతనామాలతో సాక్షాత్తూ భగవత్స్వరూపమైన శ్రీమద్భగవద్గీత ఆరాధించుకునేందుకు భక్తులు వచ్చి పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనదలచిన భక్తులు 9949688136, 8886776180 నెంబర్లలో సంప్రదించి పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు

ఘనంగా ఎఫ్రాయిం ప్రార్థనా మందిరం వార్షికోత్సవం



వినుకొండ (నూజెండ్ల): స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని ఎఫ్రాయిం ప్రార్థనా మందిరం 43వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అర్థమయ్యే రీతిలో మాట్లాడే బొమ్మల ద్వారా మానవ జీవిత పరమార్థం, మిషనరీ జీవిత చరిత్రలు సిస్టర్ రాణిరోజ్ బృందం వివరించారు. అనంతరం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. అనంతరం సంఘ కాపరి పాస్టర్ ఎలీషా, పాస్టర్లు ఫిలిప్‌రాజు, సూర్యచంద్ర, ఆశీర్వాదంలు మాట్లాడుతూ ప్రభువైన ఏసుక్రీస్తు మానవులందరికీ పాప క్షమాపణ, మోక్షం ఇచ్చేందుకు ఈ లోకంలోకి అవతరించాడని వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఏబీసీ పాస్టర్లు డేవిడ్, యేసురాజు, బుజ్జిబాబు, పెద్దలు బ్రహ్మానందరావు, కృపాకర్‌రావు, పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యలతో వృద్ధుడి ఆత్మహత్య

చిలకలూరిపేటటౌన్: అనారోగ్య సమస్యలతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకొన్న సంఘటన ఆదివారం వెలుగు చూసింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పసుమర్రు గ్రామానికి చెందిన కోట సుదర్శనరావు (82) గత 10 సంవత్సరాల నుంచి ఊపిరితిత్తుల సమస్యలతో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల ఎనిమిదో తేదీ షేవింగ్ చేయించుకొని వస్తానని భార్యకు చెప్పి బయటకు వచ్చాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదేరోజు సమీపంలోని పసుమర్ర బ్రిడ్జిపై నుంచి దూకినట్లు కొంత మంది చెప్పారు. ఆదివారం ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా సుదర్శనరావు మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య, ఐదుగురు కుమారులు ఉన్నారు. మృతుడి మనవడు సుదర్శనరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేల్పూరులో నెలాఖరున కోల్డ్‌స్టోరేజ్ ఆరంభిస్తాం


సొసైటీ చైర్మన్ చెన్నయ్య



వివరాలు వెల్లడిస్తున్న సొసైటీ చైర్మన్ చెన్నయ్య

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో రూ.6 కోట్లు వ్యయంతో ఏర్పాటు చేసిన కోల్డ్‌స్టోరేజీ ఈనెలాఖారుకు ప్రారంభోత్సవం చేస్తున్నట్లు సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య తెలిపారు. ఆదివారం స్థానిక సొసైటీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలనలో స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో గతంలో ఎన్నడూ చేయనటువంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. శావల్యాపురం సొసైటీ కార్యాలయంలో రూ. 40 లక్షల వ్యయంతో చేపట్టిన భవనంలో సొసైటీ బ్యాంకు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. జనరిక్ మందుల దుకాణాలు కూడా శావల్యాపురం, వేల్పూరు రెండు గ్రామాల్లో ఈనెలాఖారులో ప్రారంభోత్సవం చేస్తామన్నారు. రైతుల సహకారంతో సొసైటీ అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. ఆయనతో పాటు ఎంపీటీసీ సభ్యులు దేవనబోయిన పోతురాజు, సొసైటీ మాజీ డైరెక్టర్ కొణతం ఏరుకలరెడ్డి, పాట్టిపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు, అనాథలకు అండగా నిలవాలి



లిటిల్‌హార్ట్స్ అనాథాశ్రమ చిన్నారులతో ఎన్‌సీసీ క్యాడెట్స్

నరసరావుపేట ఈస్ట్: దివ్యాంగులు, అనాధ బాల, బాలికలకు చేయూత అందించి వారి అభ్యున్నతిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని శంకర భారతిపురం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని ఎం.పార్వతి తెలిపారు. పాఠశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని అంధుల బాలిక వసతి గృహం, లిటిల్‌హార్ట్స్ చిల్డ్రన్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలోని అనాధ బాలబాలికల వసతి గృహంలో అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం పార్వతి మాట్లాడుతూ, దివ్యాంగులకు ప్రతిఒక్కరూ అండగా ఉండాలని తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, దివ్యాంగులను తల్లిదండ్రులు భవిత పాఠశాలకు పంపటం ద్వారా వారిలో ఆత్మస్థైర్యం నింపాలని వివరించారు. పాఠశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ తమ సొంత నిధులతో కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో దివ్యాంగులకు అవసరమైన విద్యా పరికరాలు, కిట్లు అందచేసేలా దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ షేక్.ఫాతిమా, వసతి గృహాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల ర్యాలీ

రాజుపాలెం: మండలంలోని ఉప్పలపాడు ఎస్సీ కాలనీలో దళిత బహుజన రిసోర్స్ ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో డీబీఆర్‌సీ రిసోర్స్ పర్సన్ కోటిరత్నం మాట్లాడుతూ 1948లోనే మానవ హక్కుల దినోత్సవం ఏర్పాటైందని తెలిపారు. ప్రతీ ఒక్కరు మానవ హక్కుల గురించి తెలుసుకోవాలని తెలిపారు. మానవ హక్కులను తెలియజేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, డ్వాక్రా గ్రూపుల యానిమేటర్స్ పాల్గొన్నారు.

ఘనంగా లూథరన్ చర్చి ప్రథమ వార్షికోత్సవం



చర్చిలో ప్రార్థనలకు హాజరైన భక్తులు

విప్పర్ల(క్రోసూరు): మండల పరిధిలోని విప్పర్ల గ్రామంలోని లూథరన్ చర్చి ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ బిషప్ సూర్య ప్రకాష్ వాక్యసందేశం అందించారు. సత్తెనపల్లి ఫీల్డ్ చైర్మన్ రెవ.డా.ఎం.సుందరరావు మాట్లాడుతూ క్రైస్తవుల సేవల గురించి తెలియ జేశారు. లూథరన్ మిషన్ ద్వారా విద్య, వైద్య సామాజిక సేవలు అందించిన విషయం జ్ఞాపకం చేశారు. క్రైస్తవులు ప్రేమ, జాలి కలిగి ఉండాలని తెలిపారు. ప్రార్థనలనంతరం ప్రేమవిందు నిర్వహించారు. పాస్టర్ రెవ.రాజకుమార్, పాస్టర్ జాషువ, రాజు, డెలిగేట్ సభ్యుడు కిరణ్, సంఘ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.